www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 15 నవంబర్ 2025

5

అన్నమయ్య





ఉపాధి పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు

కిడ్నీ రాకెట్ ముఠాతో అన్ని రాష్ట్రాల్లోనూ లింకులు

- తీగలాగితే కదులుతున్న దండుపాళ్యం డొంక
- కిడ్నీలు పోగొట్టుకొంటున్నది ఎక్కడివారు..?
- అమర్చుకుంటున్నది ఎవరు..?
- డబ్బు ఎరచూపి కిడ్నీలు దొంగలించారని పుకార్లు
- కిడ్నీల రాకెట్ స్మగ్లింగ్‌కు కేంద్ర బిందువుగా గ్లోబల్ ఆస్పత్రి
- పరారీలో బెంగళూరు వైద్యుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించి, మదనపల్లె గ్లోబల్ ఆస్పత్రి కేంద్రంగా నడిచిన కిడ్నీల రాకెట్ ముఠా చేతిలో కిడ్నీలు పోగొట్టుకున్నది ఎవరు..? ఎక్కడివారు..? ఆ కిడ్నీలతో లబ్ధి పొందింది ఎవరు..? ఎక్కడెక్కడి వారు..? అన్న విషయాలు మిస్టరీగా మారాయి. కడ్నీ రాబందుల వలలో పడి అమాయక మహిళలు, పురుషులు, అనాథలు ఇంకెందరు ఉన్నారో అంతుచిక్కడం లేదు. కిడ్నీల వల్ల లబ్ధి పొందిన వారి వివరాలను అధికారులు బయట పెట్టకుండా, విచారణ నివేదికను మీడియాకు వెల్లడించకుండా గోప్యత వహించడం దేనికి సంకేతమనేది లక్షల మంది మదిని తొలసేస్తున్న ప్రశ్న. కిడ్నీ రాకెట్ ముఠా చేతిలో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం, బొడ్డుపాళ్యంకు చెందిన యమున(29)ను అదే ప్రాంతానికి చెందిన సూరిబాబు, పెళ్లి పద్మ, కాకర్ల సత్య పిక్నిక్ పేరుతో మదనపల్లెకు తీసుకొచ్చారు. 8వ తేదీ అర్ధరాత్రి పథకం ప్రకారం యమునకు మత్తుమందు ఇచ్చి రహస్యంగా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఆమె చనిపోతే మృతదేహాన్ని రెండురోజులు దాచేసి, గుట్టుచప్పుడు కాకుండా వారి స్వగ్రామానికి తరలించి చేతులు దులుపుకునేందుకు విఫలయత్నం చేశారు.

యమున దోనరే కాదు

కిడ్నీ రాకెట్ ముఠా చేతిలో ప్రాణాలు కోల్పోయిన యమున డోనరే కాదని తేలిపోయింది. కిడ్నీ రాకెట్లో కీలక పాత్ర పోషిస్తున్న దండుపాళ్యం బ్యాచ్ పెళ్లి పద్మ, కాకర్ల సత్య, సూరిబాబుల ద్వారా అమాయకురాలైన యమునకు సూరిబాబు ఊబిలోకి లాక్కున్నట్లు తెలిసింది. అనుకున్నట్లుగానే పథకం ప్రకారం పిక్నిక్ పేరుతో అరకు వెళుతున్నట్లు ఇంట్లో యమున చేత చెప్పించి, మంచిగా చూసుకుంటూ సన్నిహితంగా దగ్గరయ్యారు. 8వతేదీ మదనపల్లెకు తీసుకొచ్చి అర్ధరాత్రి ఆమెకు మత్తు ఇచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ఆమెను రహస్యంగా గ్లోబల్ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ అదే రోజు రాత్రే ఆపరేషన్ చేసి యమున కిడ్నీని దొంగలించారని సమాచారం. కిడ్నీ తీస్తే యమున ఎందుకు చనిపోయిందని యమునతో సన్నిహితంగా నటించిన సూరిబాబు కిడ్నీ రాకెట్‌లో కీలక సూత్రధారులైన పెళ్లి పద్మ, కాకర్ల సత్యను నిలదీసి గొడవ పడడంతో తిరుపతిలో వీరి వ్యవహారం వెలుగులోకొచ్చి కిడ్నీ రాకెట్ వ్యవహారం బట్టబయలైంది.



కిడ్నీ రాకెట్ దందాకు నిలయమైన గ్లోబల్ ఆస్పత్రి

ఆధారాలు చెరిపేసిన గ్లోబల్ ఆసుపత్రి యాజమాన్యం

గ్లోబల్ ఆస్పత్రి ముందు, లోపల వివిధ ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల డేటాను తెలివిగా డిలీట్ చేయించేసి, ఆధారాలు తారుమారు చేశారు. పోలీసులు ఆస్పత్రిలోని సిసి కెమెరాల పుటేజీలకు సంబంధించిన హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నా, వారికి డేటా డిలీట్ అని రావడంతో విస్తు పోయినట్లు తెలుస్తోంది.

డాక్టర్ల వెనక ఆంతర్యం ఏమిటి..?

కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ జరగాలంటే అధునాతన టెక్నాలజీ కలిగిన వైద్య పరికరాలు, అపార అనుభవం కలిగిన వైద్య నిపుణుల బృందం ఉండాలి. యమున కిడ్నీ శనివారం అర్ధరాత్రి తొలగించడం నిమిషాల వ్యవధిలోనే ఆమె చనిపోవడం, ఆ కిడ్నీతో ముఠాలోని వైద్యుల బృందం గోవా లేదా బెంగళూరుకో తీసుకెళ్లిపోవడం, డబ్బులు పంపిణీ అన్ని చకచకా అదే రోజే జరిగిపోయాయని తెలిసింది. ఇదంతా నిమిషాల వ్యవధిలో కిడ్నీ తొలగించడం, దొంగలించడం జరిగిందంటే రాకెట్‌లోని ముఠా పథకం ప్రకారం ముందుగానే డాక్టర్ల బృందాన్ని రప్పించుకుని యమున కిడ్నీలు తొలగించారని తేటతెల్లం అవుతోంది. ఆమె చనిపోయిన రెండు రోజులు యమున మృతదేహాన్ని ఎక్కడ ఉంచారన్నది లక్షల మంది మదిలో మెదులుతున్న ప్రశ్న. పోలీసులకు సైతం ఆ రహస్యాన్ని బయటకి పొక్కనివ్వకపోవడం, విచారణకు వచ్చిన అధికారులు, పోలీసులు గోప్యత పాటించడం వెనక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆంజనేయులుకు సన్నిహితులే విచారణాధికారులు

దొంగే.. దొంగ.. దొంగా.. అని అరిచినట్లు విచారణ జరుగుతోంది. సుధీర్ఘకాలం అస్పత్రుల్లో కలసి పనిచేసిన అన్నమయ్య జిల్లా డిసిహెచ్‌ఎస్, కిడ్నీ రాకెట్‌లో ఎ1 ముద్దాయి డాక్టర్ ఆంజనేయులు, ప్రస్తుతం విచారణకు వచ్చిన వైద్యాధికారులతో కలిసి సుధీర్ఘకాలం పనిచేశారు. కేసు విచారణకు వచ్చిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ మీడియా ఆఫీసర్ దేవశిరోమణి, చిత్తూరు డిసిహెచ్‌ఎస్ పద్మాంజలిదేవి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ రమేష్‌బాబు ఆంజినేయులుకు అత్యంత సన్నిహితులు కావడం గమనార్హం. ఇలాంటి వారితో విచారణ చేయిస్తే కేసు నీరుగారిపోతుందనేది కాదనలేని సత్యం.

కేసు తారుమారుకు విశ్వప్రయత్నాలు

కిడ్నీ రాకెట్‌లోని ముఠాను పట్టుకోవడానికి పోలీసులు బృందాలుగా ఏర్పడి, ఒకవైపు దర్యాప్తు కొనసాగిస్తూ అనుమానితులను అదుపులోకి తీసుకున్నారనే సమాచారం ఉంది. ఇప్పటికే ఆధారాలు చెరిపేసిన కిడ్నీ రాకెట్‌లోని బృందం బాగోతం బయటపడినప్పటికీ ఆ ఆసుపత్రి యాజమాన్యంలోని డాక్టర్ ఆంజనేయులు మినహా అందులో పని చెస్తున్న వైద్య బృందం డాక్టర్ అవినాష్, డాక్టర్ శాశ్వతిలపై ఎలాంటి కేసులు నమోదు చేయక పోవడంతో పోలీసుల దర్యాప్తు తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

మూలాలను గుర్తించడంలో పోలీసులు విఫలం

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా కిడ్నీ రాకెట్‌లోని మూలాలను గుర్తించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పలు ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నిజానిజాలను నిగ్గు తేల్చడానికి చిన్నపాటి వ్యక్తులను మాత్రమే అదుపులోకి తీసుకుంటున్నట్లు వినికిడి. కిడ్నీ రాకెట్‌లో అసలు సిసలైన దొంగల ముఠాను పట్టుకోలేకపోతున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. కిడ్నీ రాకెట్ ముఠా వ్యవహారం విశాఖ నుండి విజయవాడ, తిరుపతి, మదనపల్లె, బెంగుళూరు, గోవా వరకు ఉందంటే ఈ రాకెట్‌లో సూత్రధారులు పాత్రదారులు పలు రాష్ట్రాల్లో మానవ అవయవాల అక్రమ రవాణా చేసే హేమాహేమీలు ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. లోకల్‌గా ఉన్న పోలీసులతో దర్యాప్తును కొనసాగిస్తే కేసును చేదించలేరు అనేది నగ్నసత్యంగా పలువురు పేర్కొంటున్నారు. సిట్టింగ్ జడ్జి, ఐఎఎస్ అధికారితో విచారణ చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఎవరీ బెంగళూరు వైద్యుడు..?

మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రిలో అమాయకపు మహిళకు ఆపరేషన్ చేసి కిడ్నీ దొంగలించిన ఆ బెంగళూరు వైద్యుడు ఎవరన్నదీ మిస్టరీగా మారింది. కేసులో ఎ2గా ఉన్న ఆ బెంగుళూరు వైద్యుడు వివరాలు తెలియకుండానే గ్లోబల్ ఆసుపత్రి నిర్వాహకులు అతనికి ఆపరేషన్ థియేటర్ అప్పగించారా అన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతోంది. సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇంకా బెంగుళూరు వైద్యుడు దొరకలేదని, ప్రత్యేక బృందంతో గాలింపు చేపడుతున్నామని పోలీసులు చెబుతుండడం అంత నమ్మ శక్యంగా ఉండడం లేదు. పెద్దస్థాయిలో పైరవీలు జరుగుతూ కేసు నీరుగారే ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి.

యమున కిడ్నీ ఏమైంది..?

యమునకు కిడ్నీ తొలగించారని పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపారు. ఆ తొలగించిన కిడ్నీ ఏమైందనేది కూడా మిస్టరీగానే ఉంది. గోవాకు చెందిన రంజన్ నాయక్ అనే వ్యక్తి కిడ్నీ కొనుగోలు చేశాడని సమాచారం. ఆ కిడ్నీ అతనికి చేరిందా, లేక ఇంకేమైంది అనేది అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. ఇటు పోలీసు అధికారులు, అటు వైద్యాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం, వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని సమాధానం దాటవేస్తున్నారు. దీంతో ఈ కేసు ఎటుపోతోంది, ఏ మలుపు తిరుగుతోంది. అసలైన నేరస్థులను కాపాడే ప్రయత్నం జరుగుతోందా, బాధితులకు న్యాయం జరుగుతుందా, అసలైన కడ్నీ రాకెట్ ముఠా బయటకు వస్తుందా, పెద్దల హస్తం ఏమైనా ఉందా, ఇలా ఎన్నో సమాధానాలు లేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.

'ఉపాధి' బకాయిలు విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉపాధి హామీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండలంలోని మాలేపాడు, బొమ్మనచెరువు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని పలువురు కార్మికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది వారాలుగా ఉపాధి కార్మికులు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఉపాధి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుండడం దుర్మార్గమని, ఈ చట్టం వల్ల ఎంతోమంది పేదలు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని కోరారు. గతంలో మాదిరిగా కార్మికులకు పే స్లిప్పులు అందించాలని, పనిముట్లు అందించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.శివ, నాగరాజు, రాజు, పార్వతి, వెంకట నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు భార్యకు చెక్‌ను అందజేస్తున్న ఎస్‌పి, బ్యాంకు అధికారులు

హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటాం

- రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కు అందించిన ఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హోంగార్డు కుటుంబాలకు ఎప్పటికీ అండగా ఉంటామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో హోంగార్డు ఈశ్వర నాయక్ కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18 వ తేదీ ముదివేడు క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డ్ ఈశ్వర్ నాయక్ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఉండేవారని ఆయన మృతి చెందడంతో రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించామన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే హోంగార్డు రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. హోంగార్డు కుటుంబ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఆర్ఐ పెద్దయ్య, యాక్సిస్ బ్యాంకు సిబ్బంది ప్రదీప్, అబ్దుల్ రావుఫ్, రాజేష్, హరినాద్, హోంగార్డ్ ఇంచార్జ్ ఆర్ఎస్ఐ శీను, ఎఆర్ఎస్ఐ బాలాజీ, క్లర్క్ గణేష్, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ విద్యాసాగర్

టౌన్ బ్యాంకు అభివృద్ధికి చర్యలు

- చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

ప్రజాశక్తి-మదనపల్లె

టౌన్ బ్యాంకు అభివృద్ధికి చర్యలు చేపట్టామని బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మదనపల్లె టౌన్ బ్యాంకులో సహకార సంస్థలలో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పారదర్శకత, జవాబుదారీతనం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజినల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ రోషన్ జమీర్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ మదనపల్లె టౌన్ బ్యాంక్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా యూపిఐ పేమెంట్స్ అయిన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం అమలుకు, మొబైల్ బ్యాంకింగ్ సదుపాయాలు కల్పించుటకు రిజర్వ్ బ్యాంక్ వారు అనుమతించారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి కాగలదని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత మదనపల్లె టౌన్ బ్యాంక్, ఇతర వాణిజ్య బ్యాంకుల వలే బ్యాంకు ఖాతాదారులకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు అవుతుందని తెలిపారు. బ్యాంక్ వంద సంత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెలాఖరులో శత సంవత్సర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ రోషన్ జమీర్ మాట్లాడుతూ మదనపల్లె టౌన్ బ్యాంక్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, ఈ బ్యాంకు అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందించగలమని, బ్యాంకు యొక్క పనితీరు ఖాతాదారులకు సేవలందించడంలో పూర్తి సంతృప్తిని కల్పించనదని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ భాస్కర్‌కుమార్, డైరెక్టర్లు రవీంద్రనాథ్, రవికాంత్, ముక్తియార్బన్, సోమశేఖర్, నాదెళ్ల శివ, ఆకుల కృష్ణమూర్తి, సర్దార్‌ఖాన్, జోలెపాళెం దేవేంద్ర, రామిశెట్టి భాస్కర్, నిరంజన్, ప్రొఫెషనల్ డైరెక్టర్లు కె.ఎస్.ఎస్.ప్రసాద్, కోటేశ్వరరావు, సహకార శాఖ అధికారులు ప్రవీణ్, రెడ్డెప్ప, మురళి, బ్యాంక్ సిఇఒ పి.వి.ప్రసాద్, మేనేజర్ రవిచంద్రారెడ్డి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-రాయచోటి

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎల్ నాగయ్య తెలిపారు. శుక్రవారం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజక వర్గం లోని పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల కొరకు సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 200 మంది పైగా విభిన్న ప్రతిభావంతులు నిర్ధారణ పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ సుబ్రహ్మణ్యం శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ గతంలో కంటే నేడు ప్రభుత్వం రవాణా, ఎస్కార్ట్, స్టైపండు. ఇంటి వద్ద విద్య లకు రెట్టింపు అలవెన్సు అందివ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పిల్లల తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లే విధంగా చూడాలని కోరారు. నిర్ధారణ పరీక్షలకు హాజరైన విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ స్కూటర్, ట్రై సైకిల్, వీల్ చైర్స్, రోలేటర్స్, చంక కర్రలు, వినికిడి యంత్రాలను నెల రోజుల్లోగా ఆలింకో ద్వారా అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య, జిసిడిఒ సుమతి, ఎఎస్ఒ అసదుల్లా ఎంఇఒలు ఆంజనేయ నాయుడు, జయచంద్ర, వైద్యులు శివాసిస్, శివ ప్రకాష్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో రైతుబజార్లు

- 35 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- రూ.145 కోట్ల రుసుం వసూళ్లే లక్ష్యం
- మార్కెటింగ్ శాఖ డిడి లావణ్య

ప్రజాశక్తి-పీలేరు

రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లోనూ నియోజకవర్గానికి ఒక రైతు బజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు మార్కెటింగ్ శాఖ కడప డిప్యూటీ డైరెక్టర్ పసుపులేటి లావణ్య తెలిపారు. శుక్రవారం ఆమె పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించి, కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వారపు సంత పక్కన ఉన్న 46 సెంట్లు మార్కెట్ కమిటీ స్థలంలో రూ.26 లక్షలతో నిర్మించనున్న రైతు బజారు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కడప రీజినల్ పరిధిలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా వాటిలో రైతు బజార్లు లేని 35 నియోజకవర్గాలను గుర్తించామని, వీటిలో రైతుబజార్ల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందు కోసం ప్రతి నియోజకవర్గంలోనూ రైతుబజారు ఏర్పాటుకున్న సాధ్యాసాధ్యాలను, స్థలాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. రైతు బజార్ల ఏర్పాటుకు తగిన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయా లేదా అని స్థలాన్వేషణ చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం కొన్ని చోట్ల కలెక్టర్ స్థలాలు కూడా కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కడప రీజినల్ పరిధిలోని ఎనిమిది జిల్లాల్లోనూ 2025-26 సంవత్సరానికి రూ.145 కోట్ల రుసుము వసూలు చేయాలన్న లక్ష్యానికి గాను ఇప్పటి వరకు రూ. 69 కోట్లు వసూలు చేసి 47 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఈ లక్ష్యసాధనలో అన్నమయ్య జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, రూ.9 కోట్ల రుసుం వసూళ్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.6.5 కోట్లు వసూలు చేసి, 73 శాతం లక్ష్యాన్ని సాధించారని చెప్పారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎడి త్యాగరాజు, పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, కార్యదర్శి హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరులో రైతుబజార్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న డిడిఎం లావణ్య

క్రమశిక్షణతో మధుమేహ నియంత్రణ

- అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రాధిక

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

సరైన జీవనశైలిని అనుసరించడం ద్వారానే ద్వారానే మధుమేహం వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చునని అడిషనల్ డిఎంహెచ్‌ఒ రాధిక, పారామెడికల్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఆవరణంలో జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల పరిరక్షణ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో 165 దేశాల్లో ప్రజలు ఈ వ్యాధికి గురయ్యారని పేర్కొన్నారు. మధుమేహం అనే దీర్ఘకాల వ్యాధిని అశ్రద్ధ చేస్తే గుండెపై ప్రభావం, కంటిచూపు మందగించడం, కంటి చూపు మందగించడం శరీరంపై గాయాలు మానకపోవడం, నరముల బలహీనత, కాళ్లు తొలగించడం, పక్షపాతం లాంటి సంభవిస్తాయని పేర్కొన్నారు. ఒకసారి మధుమేహం బారిన పడితే దానిని నిర్మూలించడం సాధ్యం కాదన్నారు. వ్యాధికి కారణాలు వంశపార్యం పరంగాను, మితిమీరిన ఆహారం తినడం, శరీరంలో సరైనటువంటి మోతాదులో ఇన్సులిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాకపోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, గర్భదారణ సమయంలో మధుమేహం సంక్రమిస్తుందన్నారు. తరచుగా మూత్రం ఎక్కువ రావడం, తీవ్రమైన ఆలసట ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధిని నిర్ధారించుకుని సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చునన్నారు కార్యక్రమంలో డెమో దేవశిరో మణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు రైతు సోదరులకు చాలా లాభదాయకంగా ఉంటుందని రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి మండలంలోని సిబ్యాల గ్రామంలో రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి జిల్లా నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆదేశాలు మేరకు రైతు సేవా కేంద్రంలో రైతు సోదరులకు టిడిపి శ్రేణులతో కలిసి సబ్సిడీ ఉలవ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 10 కిలోల ప్యాకెట్‌ను ప్రభుత్వం రైతు సోదరులకు 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కేవలం రైతులు రూ.112 మాత్రమే చెల్లించి ఉలవలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఉలవలను రైతులు వారి పరిధిలోని కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు మంచి చేసే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చైర్మన్ బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉచిత యూపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నదని ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి దామోదర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్స్‌లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలం 10.12.2025 నుండి 10.4.2026 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కేంద్రాలు గురుకులాల ప్రాతిపదికన నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మొత్తం 340 మంది అభ్యర్థులు ఎంపిక చేస్తారని చెప్పారు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా మెరిట్ ఆధారితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు కేటాయిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నదలచిన అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన నిరుద్యోగ యువత ఈ నెల 16వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకొనవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం ఔత్సాహికులైనటువంటి అభ్యర్థులు www. apstudy circle. apcfss. in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన ఎన్‌జిఒ సంఘం నాయకులు

ఎపిఎన్‌జిఒ కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట ఎపి ఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలు కడప జిల్లా చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జి.నాగేశ్వర్, సహాయ ఎన్నికల అధికారిగా నరసింహులు, పరిశీలకులుగా వాసన్ వ్యవహరించారు. ఎన్నికల్లో ఎపి ఎన్‌జిఒ రాజంపేట అధ్యక్షులుగా ఎం.వరదయ్య, సహ అధ్యక్షులుగా ఎన్.హరిప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులుగా కె.కిరణ్, చంద్రమౌళి, విజయ కుమారి, కె.వి.టి.వి.నాయుడు, పి.వెంకటేష్, కార్యదర్శిగా టి.విజయ్ కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా బి.సరళ, ఎం.హరిప్రసాద్, ఇ.నరసింహులు, వెంకటసుబ్బయ్య, హర్షవర్ధన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.మణి, కోశాధికారిగా బి.శ్రీనివాసరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, కార్యదర్శి నిత్యపూజయ్య పాల్గొని మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ ఆధ్వర్యంలో ఉద్యోగులకు జిపిఎఫ్, ఎపి జిఎల్ఐ, డిఎ, చైల్డ్ కేర్‌లీవ్, పోలీసు వారికి సరెండర్ లీవ్ వంటి డిమాండ్లు నెరవేర్చుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం నూతన కార్యవర్గానికి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా నాయకులు నంద్యాల రాజశేఖర్, పద్మనాభరావు, కోడూరు ఓబులేషు, మహాదేవ దేవేంద్ర, ప్రొద్దుటూరు సదాశివ, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనతో ఒరిగిందేమీ లేదు : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె పట్టణ అభివృద్ధి, జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజ్ అంశాలపై కూటమి మంత్రులు స్పష్టత ఇవ్వకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ విమర్శించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మదనపల్లెకు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ పర్యటించిన విషయం తెలిసిందే. ప్రజలు ఈ పర్యటనపై భారీగా ఆశలు పెట్టుకున్నప్పటికీ, మదనపల్లె అభివృద్ధికి సంబంధించిన ఏ అంశంపైనా మంత్రులు హామీలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేస్తారన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదన్నారు. మెడికల్ కాలేజ్ పిపిపి విధానం, దాని భవిష్యత్‌పై వైద్య శాఖ మంత్రి స్పందించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన మదనపల్లె కేంద్రంగా వెలుగులోకి వచ్చిన కిడ్నీ రాకెట్‌పై ఏమి చర్యలు తీసుకున్నారు? హాస్పిటల్‌ను సీజ్ చేస్తారా? ఇందులో ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి? వంటి కీలక అంశాలపై ప్రభుత్వ మంత్రులు నిశ్శబ్దం పాటించడం దురదృష్టకరమని తెలిపారు. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తమ పార్టీకి చెందిన వ్యక్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికే వచ్చి, మదనపల్లె అభివృద్ధి లేదా సివిల్ సప్లైస్‌పై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు. పట్టణ రోడ్ల దుస్థితి, మౌలిక వసతుల లోపాలు, నగరాభివృద్ధి పై ఎలాంటి హామీలు ఇవ్వకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమైందని తెలిపారు.మదనపల్లె మునిసిపల్ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకమండలి ప్రమాణ స్వీకారం తప్ప ప్రజలకు ఈ పర్యటన ద్వారా ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు.


సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి


ఎంపిపి అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న ఎంపిటిసిలు

ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం

- ఆమోదించిన మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మండలంలో 11ఎంపిటిసిలు ఉండగా వారిలో ప్రస్తుత ఎంపిపి లక్ష్మీ నరసమ్మ సమావేశానికి హాజరు కాలేదు.ఆమె మూడు నెలలు సెలవు పెట్టారు. మిగతా 10 మంది ఎంపిటిసిలు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సమక్షంలో హాజరై ప్రస్తుత ఎంపిపి కె.లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపగా సబ్ కలెక్టర్ ఎం పిటిసిల నిర్ణయాన్ని సమర్థిస్తూ ఎంపిపి లక్ష్మీనరసమ్మను బాధ్యతల నుండి తొల గించారు. కొత్త ఎంపిపి ప్రక్రియను కలెక్టరుతో మాట్లాడి సభ్యులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ భారతి


బాలికలను రక్షిద్దాం..చదివిద్దాం

ప్రజాశక్తి - కలికిరి

వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కలికిరి మండలం గురుకుల పాఠశాలలో మండలస్థాయిలో బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి మాట్లాడుతూ బాలికలు ఏ విధంగా రక్షణ కల్పించుకోవాలి, బాలిక భద్రతాభావం కలిగి ఉండి తమను తాము రక్షించుకోవాలని పేర్కొన్నారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని వైపు అడుగులు వేయాలని, బాగా చదువుకొని తమ తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. ప్రిన్సిపల్ సోమశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత ఉన్న పుడు లక్ష్యాన్ని సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ కె.శేఖరాణి, ఉపాధ్యాయులు సి.సర్వలత, సూపర్‌వైజర్లు ఆర్ అరుంధతి, సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి ఎంపిడిఒగా ఫక్రుద్దీన్ సాహెబ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఫక్రుద్దీన్

నిమ్మనపల్లి నూతన ఎంపిడిఒగా డి.ఫక్రుద్దీన్‌సాహెబ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న రమేష్‌బాబు ఉన్నతాధికారులు ఎంపిడిఒగా బాధ్యతలు అప్పగించారు. ఆ స్థానంలో నంద్యాల జిల్లా డోన్ మండలంలో డిప్యూటీ ఎంపిడిఒగా పని చేస్తున్న డి.ఫక్రుద్దీన్‌సాహెబ్ ఉద్యోగోన్నతి పొంది నిమ్మనపల్లి ఎంపిడిఒగా బాధ్యతలు చేప ట్టారు. ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా పారదర్శకంగా చర్యలు చేపడతామని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా, క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, చేపట్టడానికి అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తానన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వై.ఎస్.జగన్ పిలుపు మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డిద్వారకానాథ్ రెడ్డి ఆదేశాలమేరకు వైసిపి మం డల కన్వీనర్ కొండ్రెడ్డిశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటకొండ గ్రామ పంచాయతీ, ఎగువ సునిగ తాండ గ్రామపంచాయతీలలో కోటిసంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కోటిరెడ్డి, పద్మనాభరెడ్డి,తాళ్ల చంద్రశేఖర్, మల్లికా ర్జున, శ్రీనివాసులు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.


కోటి సంతకాల సేకరణలో వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవాన్ని రాయచోటిలోని డైట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు డిఇఒ సుబ్రమణ్యం తెలిపారు. మొదట జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి డిఇఒ అధ్యాపక బృందంతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ బాలల హక్కులు, విద్య, పిల్లల సంక్షేమం గురించి అవగాహన పెంచడానికి భారతదేశంలో బాలల దినోత్సవాన్ని జరుపుకోవాలని జరుగుతోందన్నారు. నాణ్యమైన చదువుల ద్వారానే మానవ వికాసం వృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వక్తృత్వ పోటీలలో గెలుపొందిన ఛాత్రోపాధ్యాయులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యా యులు పాల్గొన్నారు. **కలకడ:** బాలల దినోత్సవ వేడుకలను మండలంలోని వాడవాడలా నిర్వహించారు. జవహర్‌లాల్‌నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలోని జడ్‌పి హైస్కూళ్లు, కలకడ(ఉర్దూ,తెలుగు) ఎర్రయ్యగారిపల్లి, కదిరాయచెరువు, నడి మిద్దె, కోన, పాపిరెడ్డిగారిపల్లి, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో, శ్రీ చైతన్య, శ్రీ విద్యారణ్య, ఆక్స్‌ఫర్డ్, విశ్వ జ్యోతి పాఠశాలలలో బాలల దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించినట్లు ఆయా పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టి నట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** నిమ్మనపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని హెచ్‌ఎంలు ఘనంగా నిర్వహించినట్లు ఎంఇఒ నాగరాజు తెలిపారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మండలం లోని జడ్‌పి హైస్కూల్, జడ్‌పిఉర్దూ పాఠశాలలో, మోడల్ ప్రైమరీ స్కూల్లో, ఆదర్శ పాఠశాల, కెజిబివి, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆట పోటీలను నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖాధికారి సుబ్బనరసయ్య, హెచ్‌ఎం అపర్ణాదేవి, అంజాద్ అలీఖాన్, భాస్కరన్, నాదిర్ షావల్లి, గుల్జార్ అహ్మద్, ముంతాజ్ బేగం, ఇర్షాద్ అలీ, నీల వేణి, గుర్రప్ప, సుధాకర, మాధవి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీఅభివృద్ధి కార్పొరేషన్


రాయచోటి : మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

డైరెక్టర్ రెడ్డయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డయ్య మాట్లాడుతూ కల్మషం లేకుం డా బాల్యాన్ని ఆస్వాదించాలని పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు చేరుకో వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంఘం ఉపాధ్యక్షులు భాస్కర్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు అమరావతి, ఉపాధ్యాయులు వేమిరెడ్డి సుబ్బారెడ్డి, రాధమ్మ, సువర్ణముఖి, ఎఫ్ఎల్ఎన్ జిల్లా సమన్వయకర్త రాజశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు. **చిన్నమండెం:** మల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డన్న ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. నేటి బాలలే రేపటి పౌరులని,పిల్లలందరూ అన్ని రంగాలలో అత్యున్నత ప్రతిభను కనబరిచి మహోన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు శ్రీరెడ్డి, ముని సుధాకర్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, వెంకట రమణయ్య పాల్గొన్నారు. **పీలేరు:** పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పి. ప్యారూఖాన్, తెలుగు పండితులు భాస్కర్, శాఖ గ్రంథాలయాధికారి అమర్నాథ్, ఇతర ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


కలకడ : నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ కమిటీ సభ్యులు బి.రమేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయం కలికిరి నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వ ర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అతి థిగా హాజరైన రమేష్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాల దేవాలయాలని విద్యా ర్థులకు జ్ఞానాన్ని ఇచ్చే కల్పతరువని కొనియాడారు. గ్రంథాలయాలకి మన ప్రభు త్వంలో పూర్వ వైభవం రాబోతుందని దీనికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుఒక చారిత్రకమైనటువంటి మార్పుని తీసుకురానున్నారని, తెలిపారు. గ్రంథా లయాలలో జరుగుతున్న అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తు న్నారని అన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీ యూపీ స్కూల్ ప్రధానోపా ధ్యాయులు, సిఆర్‌పి, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో నాయకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించినట్లు స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించి, తమ మేధాశక్తిని తెలివితేటలను పెంచుకో వాలని తెలిపారు.ప్రతి విద్యార్థి దశ నుండే గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసు కోవాలని, దాని ద్వారా కాలం వృధా కాకుండా మంచి క్రమశిక్షణ తో మెలిగేందుకు విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నట్టు తెలిపారు.జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సితారుద్దీన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు . **బి.కొత్తకోట:**58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కురబలకోట శాఖ గ్రంథాల యంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపిడిఒ గంగయ్య, ఎంఇఒ ద్వారకనాథ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంద్రాణి హాజరయ్యారు. విద్యార్థులు, ఎంపిడిఒ గంగయ్య జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించడానికి గ్రంథాల యాలు దోహదపడుతాయన్నారు.గ్రంథాలయ పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు.మొబైల్ ఫోన్లు,టీవీలపై ప్రాధా న్యత తగ్గించి పుస్తకపట్టణంపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్ర మంలో పద్మావతమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.**నందలూరు :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయశాఖ అధికారి రవిశంకర్ రాజు తెలిపారు. 14వ తేదీ నుంచి 20వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, రవికుమార్, పాఠకులు, ద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** తంబళ్లపల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారో త్సవాల భాగంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వల గావించి విద్యార్థులకు నెహ్రూ జననం, విద్యాభ్యాసం, నవ భారత నిర్మాణంలో నెహ్రూ పాత్ర గురించి విద్యార్థులకు ఎంపిపి ఉధ్యా యులు రెడ్డిప్పరెడ్డి ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, గ్రంథాలయ అధికారి జిలాని, సరోజమ్మ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఎంఇఒ రాజగోపాల్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.ముని గోపాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని గొల్లపల్లి సర్కిల్ లోని ప్రధాన శాఖ గ్రంథాలయం నందు గ్రంథాలయ అధికారణి వసంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో వై.ఎస్ మునిరత్నం, ప్రముఖ మోటివేటివ్ స్పెషలిష్ట్ రామ్మూర్తి, లింగాల యుగంధర్ ఆచారి, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు రెడ్డెప్ప, రామ్మోహన్ నాయుడు, శారద, నిషారాణి, డాన్స్ టీచర్ లావణ్య, గ్రంథాలయ సిబ్బంది జయమ్మ, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రాయలసీమ గ్రామాలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయలసీమలోని గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభి వృద్ధి చెందాలని ట్రైనీ ఐపిఎస్ అధికారులు తరుణ్‌యాదవ్, హర్షవర్ధన్ (ఐఎఫ్ఎస్) పేర్కొన్నారు. మూడు రోజులుగా మండలంలోని బి.ఎర్రగుడి, కోనం పేట, లక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల జీవనవిధానం, జీవనోపాధి కల్పన, గ్రామాల అభివృద్ధి, పంచాయతీల విధి విధానాలు, భూ సమస్యలు, రెవె న్యూ విధానం తదితర సమస్యలపై ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామా ల్లోని సమస్యలపై ఆరా తీసి చివరి రోజున స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ట్రైనీ అధికారులను ఎంపిడిఒ రెడ్డయ్య, అధికా రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభు త్వాలు ఇలాంటి గ్రామాలపై దృష్టి సారించి అభివృద్ధి బాటలో నడిపిం చాలన్నారు. కొన్ని గ్రామాలు అటవీ ప్రాంతంలో నివసి స్తున్న వారిపై ప్రభు త్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని విధాల అభివృద్ధి బాటలో నడిపిం చాలన్నారు. కార్యక్రమంలో తన్మయిజాహస్(ఐఆర్ఎస్), సౌరబ్‌కుమార్(ఐఆర్ఎస్), వినీత్‌జాదవ్(ఐఆర్ఎస్), డి.ఆనంద్(ఐఆర్ఎంఎస్)ను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో ఎంఇఒ చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య , ఇఒపిఆర్‌డి ఉషారాణి, అధికారులు పాల్గొన్నారు.


తరుణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది



విద్యుత్ పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విద్యుత్ పొదుపు ఎంతో అవసరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రతి ఒక్కరూ విద్యుత్ శక్తి పొదుపు చేయడం ఎంతో అవసరమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం చౌటుప్పల్‌లో విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంరక్షణ పొదుపు మానవాళికి ఎంతో అవసరమన్నారు. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, బల్బులు అవసరం మేరకే వాడుకోవాలన్నారు. అవసరం లేనప్పుడు స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. సోలార్ ప్యానల్స్ బిగించుకోవడం ద్వారా విద్యుత్ పొదుపుతో పాటు బిల్లు కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరాల రమేష్, ఉపాధ్యాయులు నరేష్, నాగయ్య, ఎన్‌హెచ్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఎన్‌పిఎల్ క్రీడోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పట్టణంలోని నారాయణ పాఠశాలలో నారాయణ ప్రిమియర్ లీగ్‌ను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటలు పోటీలు ఏర్పాటు చేసి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు పట్ల ఆసక్తి కలిగివుండాలని, పిల్లల్లో శారీరక మానసిక అభివృద్ధి క్రీడలు ఎంతగానో ఉపయోగకరమని తెలిపారు. జాతీయ బాలల దినోత్సవంని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి అనంతరం బహుమతులు అందించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు, ఎజిఎం రవీంద్ర ఫణికుమార్, ఆర్ఐ ఆంజనేయులు, ఎఒ ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట : కోనంకి కృష్ణమూర్తి నాలుగవ వర్ధంతి పురస్కరించుకొని అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని కుప్పవారిపల్లె గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన నిపుణులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. గ్రామస్తుల నుండి అపారమైన స్పందన లభించగా అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొం దారు. శిబిరాన్ని కోనంకి జగదీష్ ఆధ్వర్యంలో వారి తండ్రి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ప్రత్యే కంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వా హకులు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

'చమర్తి' ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

- సమస్యలపై పోటెత్తిన జనం

ప్రజాశక్తి-రాజంపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టిడిపి రాజంపేట నియోజ కవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రతి వారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. వారానికి ఒకసారి రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలు పోటెత్తుతున్నారు. భూ ఆక్రమణలు, భూమి ఆన్‌లైన్ సమస్యలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు అనేక సమస్యలపై ప్రజలు ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు విన్నవించుకుని అక్కడికక్కడే పరిష్కారం పొందుతున్నారు. జగన్మోహన్‌రాజు సైతం సమస్యలపై అప్పటికప్పుడే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలు తన సమస్యగా భావించి అప్పటికప్పుడే పరిష్కారం చూపుతుండడంతో చమర్తి ప్రజా దర్బార్ వేదికను వినియోగించుకునేందుకు ప్రతివారం జనాలు ఈ కార్యక్రమానికి పోటెత్తుతున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ప్రజా దర్బార్‌లోని అర్జీల పట్ల ఏమాత్రం విసుగు చెందకుండా ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించి తక్షణ పరిష్కారం అయ్యేవిధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను సానుకూలంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జివి.సుబ్బరాజు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, పోలి శివకుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు నిధులు విడుదలపై హర్షం

ప్రజాశక్తి-కలికిరి

ఇమామ్, మౌజన్‌ల వేతనాల కొరకు రూ.90 కోట్లు విడుదల చేస్తూ జిఒ జారీ చేసిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపినట్లు కలికిరి మండల మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇమామ్, మౌజన్ లకు 90 కోట్లు నిధులు విడుదలకు జిఒ జారీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇమామ్, మౌజన్లకు 2025 ఫిబ్రవరికి మొదటి విడతగా రూ. 45 కోట్లు, రెండో విడతగా రూ.90 కోట్లు ఈ ఏడాది నవంబర్ వరకు విడుదల చేసి జిఒ జారీ చేసారని తెలిపారు. టిడిపి ఎల్లప్పుడూ మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

పాఠశాలలకు కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కుమ్మరపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ఐదు కంప్యూటర్లను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో వితరణ చేశారు. మండలంలోని కుమరపల్లి పంచాయతీ సురకవాండ్లపల్లికు చెందిన కోటిరెడ్డి సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో ప్రాథమిక పాఠశాలకు రెండు, జడ్‌పి హైస్కూల్‌కు మూడు కంప్యూటర్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండలస్థాయిలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి రూ.30వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.20వేలు నగదు బహుమతిని ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో క్రీడల్లో రాణిస్తే రూ.50వేలు నగదు బహుమతిని అందిస్తామని మండల యువ నాయకుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రామానుజన్‌రెడ్డి, ప్రధానోపాధ్యా యులు రామకృష్ణనాయక్, ఉపాధ్యాయులు, రమాకాంత్ , మల్లికార్జున, కృష్ణయ్య, మస్తాన్, నాగప్రతి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న కార్పెంటర్ జాకీర్‌హుస్సేన్ శుక్రవారం మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మదనపల్లె పట్టణం, సైదాపేటకు చెందిన జాఫర్ హుస్సేన్ కుమారుడు జాకీర్ హుస్సేన్(38) కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఇతనికి భార్య షాహీరా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 11న స్థానిక బికేపల్లి కాలనీలో ఓ ఇంటికి కార్పెంటర్ పనులు చేయడానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని చంద్రకాలనీ బైపాస్ రోడ్డులో కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జాకీర్ హుస్సేన్ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రాజారెడ్డి తెలిపారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని రంగారెడ్డి కాలనీకి చెందిన శశికుమార్ కుమార్తె అంజలీ గ్రేస్(7) స్థానిక ఎస్ జెఆర్ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లిన అంజలీ మధ్యాహ్నం అదృశ్యమైంది. చాలెంజింగ్ గా తీసుకున్న పోలీసులు ఒకటవ పట్టణ సిఐ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది వేర్వేరు బృందాలుగా ధర్యాప్తు చేపట్టారు. సరిగ్గా రెండు గంటల సమయంలోనే బాలిక ఆచూకిని రాజంపేటలో కనుగొన్నారు. విచారణలో భాగంగా మతి స్థిమితం సరిగా లేని బాలిక పెద్దమ్మే బాలికను తీసుకెళ్లిపోయినట్లు తెలిసింది. సకాలంలో స్పందించి రెండు గంటల్లో బాలిక ఆచూకి కనుగొన్న పోలీసు సిబ్బందికి బాలిక తల్లిదండ్రులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

తల్లీబిడ్డలు అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-పీలేరు

తల్లీబిడ్డలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సిఐ యుగంధర్ శుక్రవారం తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలావున్నాయి. పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి భార్య ఎద్దుల కవిత దంపతలకు కుమార్తె హేమలత, సి.జశ్వంత్‌రెడ్డి ఇద్దరు సంతానం. వీరు స్థానిక విఎస్ఎన్ సిద్ధార్థ హైస్కూల్లో చదువుతున్నారు. గురువారం తమ ఇంటిలో జరిగిన చిన్నపాటి గొడవతో మనస్థాపం చెందిన కవిత కువైట్‌లోని తన అక్కకు ఫోన్ చేసి తన బిడ్డలతో కలసి చనిపోతున్నామంటూ ఫోన్ చేసి ఆ తర్వాత సెల్ స్విచ్ఆఫ్ చేసింది. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం వెంకటరమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. వారి ఆచూకి తెలిసినవారు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.


ఎద్దుల కవిత, పిల్లలు హేమలత, జస్వంత్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)